నీటి వృథా.. తప్పని వ్యథ!

ప్రజల అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం ఇంటింటికీ తాగేనీరు సరఫరా చేస్తోంది. కానీ అంత విలువైన తాగునీరు కొన్ని చోట్ల వృథాగా పోతోంది. దానిని అరికట్టాల్సిన యంత్రాంగం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. మండలంలోని మెట్టుబండలు నుంచి చంద్లాపూర్ వెళ్లే దారిలో రోడ్డు పక్కనే మూడు రోజులుగా పైపులైను లీకవడంతో తాగునీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట):


చంద్లాపూర్ మార్గంలో వృథాగా పోతున్న తాగునీరు

శనిగరం ప్రాజెక్ట్ నుంచి
సాగునీరు విడుదల

కాలువల్లో వేసిన మట్టి, బండరాళ్లను తొలగించి శనిగరం ప్రాజెక్టుకు అధికారులు సాగునీరు విడుదల చేశారు. సాక్షి దినపత్రికలో శుక్రవారం 'మా ఊరి నుంచి నిర్వీర్యం'అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఇరిగేషన్ ఈఈ రమేశ్, ఈఈ రేష్మ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో సుమారు వింజపల్లి, రాంచంద్రాపూర్, గాగిల్లాపూర్ గ్రామాల్లోని సుమారు 500 ఎకరాల వరి పంటకు నీరు అందనుంది. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు మాట్లాడుతూ ఏ అనుమతి లేకుండా కాలువలు ధ్వంసం చేసినా, నీటి విడుదలను అడ్డుకొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కోహెడరూరల్(హుస్నాబాద్):


కాలువల్లో మట్టిని తొలగిస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

విద్యాధరి సన్నిధిలో కలెక్టర్ సతీమణి


పూజలు చేస్తున్న కలెక్టర్ సతీమణి రాధ

వర్గల్(గజ్వేల్):వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రాన్ని శనివారం కలెక్టర్ మిక్కిలినేని చౌదరి సతీమణి రాధ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు జరిపించారు. వేదపండితులు ఆమెకు అమ్మవారి పసుపు, కుంకుమ అందజేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించి, అమ్మవారి ఆశీస్సులు పొందారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

– ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి


సత్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే


దుబ్బాకటౌన్: కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. రాయపోల్ మండలం కొత్తపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్నాల సత్యనారాయణ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆయన శనివారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అండగా ఉంటానని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం


చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: సీఎంఆర్ఎఫ్ పథకం పేద ప్రజలకు వరం లాంటిదని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట, తొగుట, మిరుదొడ్డి, నార్సింగి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రూ. 31,91,500 విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక అభివృద్ధే లక్ష్యమని, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

ఫైర్ సేఫ్టీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సిద్దిపేటఅర్బన్: పొన్నాల శివారులోని పోలీస్ శాఖకు చెందిన పెట్రోల్ బంకులో సిద్దిపేట ఫైర్ స్టేషన్ సిబ్బంది శనివారం ఫైర్‌సేఫ్టీపై అవగాహన కల్పించారు. పెట్రోల్, డీజిల్ వినియోగదారుల వాహనాలలో పోసే సమయంలో అగ్ని ప్రమాదాలు జరిగితే ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవాలి, ముందు జాగ్రత్త చర్యల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్ని నిరోధక సాధనాలను ఎలా వినియోగించాలి అనే అంశాలను వివరించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ విష్ణుప్రసాద్, పెట్రోలు బంకు సిబ్బంది, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అక్రమ కట్టడంపై చర్యలేవి?

సిద్దిపేటరూరల్: ఇర్కోడ్ గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లికి చెందిన తోట్ల నర్సింగం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 278లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అక్రమంగా ఇళ్లు నిర్మించారన్నారు. పేద ప్రజలకు కేటాయించిన భూమిని స్థానిక నాయకుల అండతో గౌరిశెట్టి బాలకిషన్ ఫాంహౌజ్ నిర్మించడంతో పాటుగా పలువురు కబ్జాలు చేశారని, అధికారులు విచారణ చేపట్టాలని కోరారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి


మర్కూక్(గజ్వేల్): సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న నర్సారెడ్డి

మర్కూక్(గజ్వేల్): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మండలంలోని కాశిరెడ్డిపల్లి, దామరకుంట గ్రామాలలో సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దృష్టి సారించి అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మల్లేశం, యాదగిరి, స్వరూప, సుగుణాకర్‌రెడ్డి, నర్సింహులు, సత్యనారాయణ, రవిగౌడ్, శివారెడ్డి, క్రాంతికుమార్, బీర్‌బాల్‌సింగ్, జితేందర్‌రెడ్డి, వెంకటేశ్, రమేశ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల(సిద్దిపేట): ఆకునూరులో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.10లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము రవి ప్రారంభించారు. నాయకులు రాజుగౌడ్, నాని, రఘువీర్, మాధవరెడ్డి, రాములు, రాజు, రణం శ్రీకాంత్, శనిగరం నరేందర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కృషితోనే నిధులు

నంగునూరు(సిద్దిపేట): జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో మండలంలో సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయని పీసీసీ కార్యదర్శి యాదగిరి అన్నారు. గట్లమ్మాయిపల్లిలో శనివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీ పథకం కింద గ్రామానికి రూ.35 లక్షలు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రమేశ్, రవీంద్రాచారి, రమేశ్, శ్రీకాంత్, రాజేశం, మల్లేశం, రమేశ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతోనే మద్దతు ధర


గజ్వేల్‌రూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న యాదవరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు

– ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు, సెనగల కొనుగోలు కేంద్రాలను శనివారం గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మకుండా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలన్నారు. రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటవెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జాన్ వెస్లీ, సూపర్‌వైజర్ మహిపాల్, ఏడీఏ బాబునాయక్, ఏఈఓ నర్సింహులు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్వింటాలుకు రూ.7,280..

హుస్నాబాద్‌రూరల్: రైతులు పండించిన పొద్దుతిరుగుడు పంటను వ్యవసాయ మార్కెట్‌లో విక్రయించి ప్రభుత్వం కల్పించే మద్దతు ధర క్వింటాలుకు రూ.7,280లు పొందాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి కోరారు. శనివారం వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, వైస్ చైర్మన్లు చందు, ఐలయ్య, డైరెక్టర్లు శ్రీనివాస్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన వసంతోత్సవాలు

చేర్యాల(సిద్దిపేట): ప్రతి యేటా ఫాల్గుణ పౌర్ణమి నుంచి పాడ్యమి వరకు రెండు రోజులు సాగే డోలా ఉత్సవాలు వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు మాట్లాడుతూ తిరుమలలో శాస్త్రోక్తంగా నిర్వహించే ఉంజల్ పవళింపు సేవల్లాగానే భక్తులతో నిర్వహిస్తామన్నారు. సహజ ప్రకృతి సిద్ధమైన మోదుగ పూల రంగును దేవతా మూర్తులపై చల్లి అదే రంగును భక్తులపై చల్లి కోలాటాలు ఆడుతూ ఉయ్యాలలో స్వామిని ఊపి నిద్రపుచ్చుతారని చెప్పారు. కార్యక్రమంలో అర్చకులు శేషాచార్యులు, రాజుస్వామి, స్థానికులు లింగమూర్తి దంపతులు, అచ్యుత్ దంపతులు, లక్ష్మి, కమల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్స్‌తో జీవితాలు నాశనం: ఏసీపీ

హుస్నాబాద్: యువత ఆన్‌లైన్ గేమ్స్‌లో బెట్టింగ్‌లు పెట్టి నష్టపోతున్నారని, చివరకు జీవితాలను నాశనం చేసుకొంటున్నారని ఏసీపీ సతీశ్ అన్నారు. 'ఆన్‌లైన్ అప్పులు.. పెండ్లాం తిప్పలు' అనే షార్ట్ ఫిలింనకు చెందిన పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్లిపాయ కారం అనే యూట్యూబర్ మంచి సందేశాత్మక లఘు చిత్రాలను తీస్తున్నారన్నారు. ఆన్‌లైన్ గేమ్ ద్వారా రోజురోజుకు చనిపోయే వారి సంఖ్య పెరుగుతోందని, ఆ పరిణామాలను కళ్ళకు కట్టినట్లు ఈ షార్ట్ ఫిలింలో చూపించారని చెప్పారు. కార్యక్రమంలో యూట్యూబ్ చానల్ టీమ్ రవికుమార్, శ్రీనివాస్, దాక్షాయని, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏసీపీ సతీశ్

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక


మాట్లాడుతున్న జడ్జి ప్రియాంక

గజ్వేల్‌రూరల్: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషిచేయాలిని అదనపు జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ ప్రియాంక పిలుపునిచ్చారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి వినియోగదారుడు ఆరోగ్యానికి, భద్రతకు హాని కలిగించని ఉత్పత్తులు, సేవలను పొందే హక్కు కలిగి ఉంటారని, తాము కొనుగోలు చేసే ఉత్పత్తులు, సేవల గురించి పూర్తి సమాచారం తెలుసుకొనే హక్కు ఉంటుందని చెప్పారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు, న్యాయమైన మార్కెట్‌ను ప్రోత్సహించేందుకు మనమంతా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ సీఐ సైదా, ఇన్‌స్పైర్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గోపాల్, ఉపాధ్యక్షుడు వినోద్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైతం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుజనుల్లో చైతన్యం నింపిన కాన్షీరామ్

- బీఎస్పీ నియోజకవర్గ నేత రవీందర్ గౌడ్
- ఘనంగా జయంతి వేడుకలు


హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: బహుజనుల్లో చైతన్యం నింపి, వారి హక్కుల కోసం పోరాడిన మహానాయకుడు కాన్షీరామ్ అని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్‌గౌడ్ కొనియాడారు. బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 91వ జయంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలువురు నాయకులతో కలిసి కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ కాన్షీరామ్ పోరాట ఫలితంగానే ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నాలుగుసార్లు ముఖ్యమంత్రిగా పని చేశారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, సారయ్య, బీఎస్పీ నాయకులు సుధాకర్, శంకర్, రాజు, నీరజ పాల్గొన్నారు.

చేంచల్ చెరువుపల్లిలో ..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని చేంచల్ చెరువుపల్లిలో నిర్వహించిన వేడుకలలో న్యాయవాది కిరణ్‌కుమార్ మాట్లాడుతూ కాన్షీరామ్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని బహుజనులంతా రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలన్నారు. అంబేద్కర్ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు పోచయ్య, వెంకటేశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్‌లతో మెరుగైన విద్య


చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచలో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ యాదవరెడ్డి


అక్కన్నపేట(హుస్నాబాద్): కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న రంగానాయక్

ఎంఈఓలు

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్‌లతో మరింత మెరుగైన విద్య అందుతుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు సూచించారు. వివిధ పాఠశాలల్లో శనివారం కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించారు. చిన్నకోడూరు మండల పరిధిలోని రామంచ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈఓ యాదవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యం ఏర్పరుచుకుని ఆ దిశగా కష్టపడి ఉన్నతులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సత్తవ్వ, అబ్దుల్ షరీఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రామంచ ఉన్నత, ప్రాథమిక పాఠశాల మహిళా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్‌లు, మహిళా ఉద్యోగులు, మహిళా సంఘాల సభ్యులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల తల్లులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హోలీ వేడుకలు నిర్వహించారు.

కేశపూర్ ఉన్నత పాఠశాలలో

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కేశపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ గుగులోతు రంగానాయక్ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌లను ప్రతి విద్యార్థి ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యతో పాటు, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఎంఈఓ ప్రవీణ్‌బాబు కోరారు. మండల పరిధిలోని కొండాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన కంప్యూర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు కంపూటర్ విద్యపై ఉపాధ్యాయులు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి ల్యాబ్ ఏర్పాటు చేశారన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ సుకన్య, ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల హెచ్ఎంలు స్వప్నారెడ్డి, అనురాధ, ఉపాధ్యాయులు, విద్యార్థు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంప్యూటర్ శిక్షణతో మెరుగైన ఫలితాలు

దుబ్బాకటౌన్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత విద్యాబోధనలో శిక్షణ ఇస్తే ప్రతిభా వంతులుగా తీర్చిదిద్దవచ్చని రాయపోల్ మండల విద్యాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. రాయపోల్ మండలం కొత్తపల్లి, రాంసాగర్, అనాజీపూర్, వడ్డేపల్లి ప్రాథమిక పాఠశాలలో కంప్యూటర్ ఆధారిత విద్యా విధానాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ టూల్స్‌తో బోధన వెనుకబడిన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయ, గోవర్ధన్, నిర్మలాకుమారి, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

దుంపలపల్లి పాఠశాలలో..

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు డిజిటల్ విద్యాబోధన కార్యక్రమాన్ని ఎంఈఓ ప్రభుదాసు, ఎంపీడీఓ భాస్కరశర్మ ప్రారంభించారు.


కొండపాక(గజ్వేల్): బోధన గురించి వివరిస్తున్న ఎంఈఓ సత్తయ్య

బాషపై పట్టుకు ఏఐ దోహదం

కొండపాక(గజ్వేల్): భాషపై పట్టు సాధించేందుకు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్(ఏఐ) దోహదపడుతుందని మండల విద్యాధికారి బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం, మంగోల్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ బోధనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఏఐ బోధన కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజ్‌బహదూర్, నాగ ప్రభాకర శర్మ, రవి, ఉపాధ్యాయులు మధురవాణి, రామకృష్ణారెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రేషన్ బియ్యం పట్టివేత

మద్దూరు(హుస్నాబాద్): ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. మండలంలోని మర్మాముల గ్రామంలో లబ్ధిదారుల నుంచి ఓ గుర్తుతెలియని వ్యక్తి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి గ్రామంలోని ఉప్పల సుశీల అనే వృద్ధురాలి ఇంట్లో నిల్వ చేశాడు. సమాచారం తెలుసుకొన్న పోలీసులు ఆ ఇంట్లో సోదాలు నిర్వహించి 5 క్వింటాళ్ల 50 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ రమేశ్ పంచానామా నిర్వహించి ఆ బియ్యాన్ని స్థానిక రేషన్ డీలర్‌కు అప్పజెప్పారు.

◆ సబ్ స్టేషన్‌ను పరిశీలించిన డీఈ

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని పెద్దకోడూరు 33.11 కేవీ సబ్‌స్టేషన్‌ను విద్యుత్‌శాఖ డీఈ రామచంద్రయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈ రమేశ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం

దుబ్బాకటౌన్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షలు విజయం సాధించవచ్చని యూఎస్ఎఫ్ఐ (భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్) నియోజకవర్గ అధ్యక్షుడు నరేశ్ పిలుపునిచ్చారు. రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువులో రాణించాలంటే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, కార్యదర్శి సతీశ్, పీఈటీ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

◆ నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

గజ్వేల్‌రూరల్: యువత తాత్కాలిక ఆనందం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దని అదనపు సీఐ ముత్యంరాజు కోరారు. పట్టణంలోని పలు కిరాణా దుకాణాలు, బేకరీలు, టీ కొట్టు, పాన్ డబ్బాల వద్ద శనివారం సాయంత్రం డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల గురించి నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాలు కలిపిన చాక్లెట్స్ కలిగి ఉన్నా, రవాణా చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

◆ ఉజ్వల భవితవైపు అడుగులు వేయాలి

వర్గల్(గజ్వేల్): విద్యార్థులు బాగా చదువుకొని ఉజ్వల భవితవైపు అడుగులు వేయాలని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి సూచించారు. జ్యోతిబాపూలే బాలికల గురుకులంలో మహిళా రక్షణ చట్టాలు, షీ టీమ్ విధులు, సైబర్ నేరాలు, నూతన చట్టాలపై శనివారం గజ్వేల్ షీటీమ్ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులు అపరిచితుల ఫోన్‌కాల్స్‌లో మాటలు నమ్మకూడదన్నారు. డ్రగ్స్, గంజాయి తదితర మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చెడు అలవాట్లకు బానిస కావొద్దని సూచించారు. ఏఎస్ఐ శ్రీరాములు, పీసీలు లావణ్య, మహేశ్, ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

◆ కళాశాల, హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ఎస్సీ, బీసీ విద్యార్థుల కోసం హాస్టళ్లు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ డిమాండ్ చేశారు. విద్యార్థులతో కలసి ఎంఈఓ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కొమురవెల్లి మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాశ్, అఖిల్ పాల్గొన్నారు.

◆ మృతుడి కుటుంబానికి సాయం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని కస్తూరిపల్లికి చెందిన కార్మికుడు కాలకుంట్ల రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కార్మిక సంఘం మండల సభ్యులు శనివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంఘం మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

◆ చలివేంద్రం ప్రారంభం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని చాట్లపల్లిలో బరిగె పెద్ద యాదయ్య దంపతుల జ్ఞాపకార్థం శనివారం ఆ కుటుంబ సభ్యులు చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండపోచమ్మ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావ్యదర్గయ్య మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని చలివేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. యాదయ్య, రాజు, నర్సింహులు, స్వామి, భాస్కర్, ప్రభాకర్, పోచయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాలను అధికంగా చేయించినందుకుగాను సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షురాలు రూపను శనివారం పార్టీ కార్యాలయంలో అభినందించారు. మహిళా నాయకులు పాల్గొన్నారు.